12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :260 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి ఆదివారం 27 సెప్టెంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :260 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SUN 27 SEPTEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## 10 శాతం వృద్ధి సాధ్యమే

### టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన
- చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య

- మిగతా 2లో

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి



- పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి
- ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు
- పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్

- మిగతా 2లో



## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

- ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ
- పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు బీసీ జనార్ధన్ ప్రకటన

- మిగతా 2లో



## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

- సీఎం విజయ్‌పై మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- ప్రజల ముందు విజయ్ నటన ఇంకా కొనసాగుతోందని ఎద్దేవా
- డీఎంకే పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఆరోపణ
- సీఎం పదవికి తగిన హుందాతనం చూపాలని హితవు

- మిగతా 2లో

# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

## అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం
- ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు
- తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు
- రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల



పెన్ పవర్ డెస్క్:గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

- మిగతా 2లో

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



పెన్ పవర్ డెస్క్:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం

- మిగతా 2లో

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

- ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్
- గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న
- ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత
- 2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ

- మిగతా 2లో



## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు
- ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు




పెన్ పవర్ డెస్క్:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో



## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

### 95 కంపెనీలకు నోటీసులు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

- మిగతా 2లో

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు



- విద్యుత్ రంగాన్ని రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందన్న జగదీశ్ రెడ్డి
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్

- మిగతా 2లో

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

### ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పట్టు
- కోట్లాది మంది ఓటర్ల హక్కును హరించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
- యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం

- మిగతా 2లో






## వైసీపీ స్ట్రాటజీ వర్క్ అవుట్ అవుతుందా? అందుకే టీడీపీని టార్గెట్ చేసిందా?

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ-బీజేపీ-జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.

**లోకేశ్ ను టార్గెట్ చేయడం ద్వారా...**

విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా? రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు. అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది.

**కేంద్ర సంస్థల జోక్యం కోసం డిమాండ్...**

రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ-బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చునేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ డైవర్షన్ డ్రామాలు ఆడుతుంటారని దుయ్యబట్టారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు. పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు. నాటి సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణ చీకట్ల నుంచి వెలుగులోకి వచ్చిందని కొనియాడారు. అసాధ్యమనుకున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను కొన్ని నెలల వ్యవధిలోనే అన్ని వర్గాలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. కేవలం ట్రాన్స్‌కోపైనే రూ.36 వేల కోట్లు వెచ్చించి, ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచినా మరో మార్గం ద్వారా అనుసంధానించే అధునాతన గ్రిడ్ వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా ఈరోజు 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్ధన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్ధన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- మొదటి పేజి తరువాయి

తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు. "ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెళ్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్.. 95 కంపెనీలకు నోటీసులు

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

- మొదటి పేజి తరువాయి

జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (౫×=), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (జుజ×చీజు) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.

మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన రాజకీయ హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

## భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గోట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

భారత ఎన్నికల సంఘం ) తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. "మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ గ ) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు - గురుకుల కిషోర్



**నెల్లూరు సెప్టెంబర్ 26 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

పిలిస్తే పలికే ప్రజానాయకుడుడ ప్రజల మధ్యే ఉంటూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నాయకుడు మా హ్యాట్రిక్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్న...నెల్లూరు రూరల్ ప్రజల అదృష్టండ ఈరోజు సేదర్ అన్న నెల్లూరు రూరల్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండటం. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్ వారిని కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజల పట్ల అంకితభావం, సేవా దృక్పథం, మంచి మనసు, అవసరమైనప్పుడు ప్రజల తరఫున గట్టిగా నిలబడే ధైర్యం ఇవన్నీ భావితరాల నాయకులకు స్ఫూర్తిగా నిలిచే లక్షణాలు.హ్యాట్రిక్ విజయంతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, సుపరిపాలనకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

న్యాయం కోసం డిమాండ్ చేయగల ధైర్యం, అవసరమైనప్పుడు ప్రజల తరఫున గట్టిగా కమాండ్ చేయగల నాయకత్వ పటిమ ఆయన సొంతం. ఆయురారోగ్యాలతో, ఆనందంతో, మరింత ప్రజాసేవ చేసే శక్తితో నిండు నూరేళ్ళ వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.మీ నాయకత్వం భావితరాలకు స్ఫూర్తి కావాలిడ మీ సేవా ప్రస్థానం మరింత విజయవంతం కావాలి.

# పెన్ పవర్
## రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# నెల్లూరు నగరానికి కొత్త సొబగులు







**15 ప్రధాన కూడళ్లలో ఐలాండ్ల అభివృద్ధి రూ.5.26 కోట్లతో ఫౌంటెన్ల పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ**

**నెల్లూరు :సెప్టెంబర్:26 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నగరంలోని ప్రధాన కూడళ్లను సుందరీ కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 15 ఐలాండ్లను రూ.5.26 కోట్లతో అభివృద్ధి చేయడంతో పాటు ఫౌంటెన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. ఆయా కూడళ్లలోని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.వెళ్ళిన ప్రతీ చోటా టీడీపీ నాయకులు,కార్యకర్తలుమంగళవాయిద్యాల తో మంత్రికి ఘనస్వాగతం పలికారు.వీఆర్సీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం, ట్రంక్‌రోడ్డు గాంధీ విగ్రహం, ఏసీ సెంటర్ ఏసీ సుబ్బారెడ్డి విగ్రహం, ఆజాద్ సెంటర్ వివేకానంద విగ్రహం, నర్తకి సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం, కనకమహల్ సెంటర్ సుందరయ్య విగ్రహం,నక్కలోళ్ల సెంటర్ పట్టాభిరామిరెడ్డి విగ్రహం, బోసుబొమ్మ వద్ద సుభాష్‌చంద్రబోస్‌విగ్రహం, వెంకటేశ్వర పురం జాకీర్‌హుస్సేన్ విగ్రహం, శెట్టిగుంట రోడ్డులో స్వచ్ఛభారత్ విగ్రహం, నవాబుపేట బీవీఎస్ స్కూల్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహం, మినీబైపాస్‌లో పూలే, నేతాజీ విగ్రహాలు, యలమవారిదిన్నెలో అంబేద్కర్ విగ్రహం వద్ద పనులు చేపట్టనున్నారు.

శంకుస్థాపన చేసిన 14 కూడళ్లలో ఫౌంటెన్ల పనులను త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం స్థలమార్పుపై ఆర్యవైశ్యులు కోరారని, అందరూ ఏకాభిప్రాయానికి వస్తే విగ్రహాన్ని మార్చి కూడలిని సుందరంగా తీర్చి దిద్దుతామనిచెప్పారు.

నేనుశిలాఫలకాలకుప్రాధాన్యత ఇవ్వనని,శంకుస్థాపన రోజే పనులు ప్రారంభిస్తామన్నారు.

సిటీలో 17 పాఠశాలల ఆధునీకరణకు రంగం సిద్ధం చేశామని తెలిపారు. ఎనిమిది పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయని, మూడు పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి ప్రారంభించామని చెప్పారు. మరో మూడు పాఠశాలలకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

రోజుకు పది అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తామని తెలిపారు. 123 మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం రూ.50 వేల కోట్లు కేటాయించారని, రూ.23 వేల కోట్లతో పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. ఎన్నికల్లో చెప్పిన దానికంటే ఎక్కువ అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

డిసెంబరు లోపు ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌అందించేలాచర్యలుతీసుకుంటున్నామని తెలిపారు.ఈకార్యక్రమంలో కమీషనర్ నందన్,మేయర్ సుజాతా,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, టీడీపీ సిటీ అబ్బర్వర్ రాజు,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి,మాజీ కార్పొరేటర్ ఆనం రంగమయూర్ రెడ్డి,డివిజన్ల టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యస్వామి కొండను తవ్వేస్తే చూస్తూ ఊరుకోం!
## ఆలయ భూముల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి







**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన విజ్ఞానగిరి (కుమారస్వామి తిప్ప)పై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి కొండను అక్రమంగాతవ్వుతూ ఆక్రమణకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆలయ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శనివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సంఘటనా స్థలాన్ని నేరుగా సందర్శించి, బ్రేకర్ యంత్రాలతో కొండను తవ్వుతున్నట్లు పేర్కొంటున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం దేవస్థానం ఈవోకు వినతిపత్రం సమర్పించి, ఆలయ ఆస్తుల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, “వేల సంవత్సరాల చరిత్ర కలిగిన సుబ్రహ్మణ్యస్వామి కొండను సైతం వదలకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం అత్యంత ఆందోళనకరం. తవ్వకాలకు సంబంధించిన దృశ్యాలు బయటకు వచ్చినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరం” అని అన్నారు.

ఆలయ సిబ్బంది అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నప్పటికీ, తవ్వకాలకు ఉపయోగించిన యంత్రాలను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని ఆయన ప్రశ్నించారు.

గతంలో ఎంతో శ్రమించి ఆరు ఇళ్లను ఖాళీ చేయించి వినాయకుడి మండపం, పిల్లర్ నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు ఎలాంటి అనుమతులు లేకుండా ఆలయ పరిధిలోనిర్మాణాలు, తవ్వకాలు జరుగుతున్నట్లయితే వాటిని వెంటనే నిలిపివేయాలని కోరారు.

“ఆలయ భూములు, పవిత్ర క్షేత్రాల పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదు. అక్రమ తవ్వకాలకు ఉపయోగించిన ట్రాక్టర్లు, యంత్రాలను సీజ్ చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేయాలి” అని ఆయన డిమాండ్ చేశారు.

అలాగే సనాతన ధర్మ పరిరక్షణపై మాట్లాడే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకాళహస్తిలోని ఆలయ భూముల పరిరక్షణ అంశంపై దృష్టి సారించాలని బియ్యపు మధుసూదన్ రెడ్డి కోరారు. “శ్రీకాళహస్తి వైపు ఒకసారి చూడండి.. పవిత్ర ఆలయ ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి” అని అన్నారు.

అధికారులు తక్షణమే స్పందించి ఆలయ ఆస్తులను పరిరక్షించకపోతే జిల్లా నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన, ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉత్తరాజీ శరవణ కుమార్, కంఠా ఉదయ్ కుమార్, మున్నా రాయల్, బుల్లెట్ జై శ్యామ్ రాయల్, శ్రీవారి సురేష్, తిరుమల చౌదరి, పీఎం చంద్ర, ముని కృష్ణారెడ్డి, సుమతమ్మ, కొట్టే శరవణ, జీవీకే రెడ్డి, గాదిపాకుల కిరణ్, మనీ, గుణ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీపై సీబీఐ విచారణకు సిద్ధం...అయితే ఒక్క షరతు - సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**నెల్లూరు సెప్టెంబర్ 26 ఫ్రెండ్ పవర్ నెల్లూరు బ్యూరో**

అత్యంత పకడ్బందీగా జరిగిన డీఎస్సీపై సీబీఐ విచారణ అంటూ వైసీపీ రాద్ధాంతం చేస్తోంది

సీబీఐపై అంత నమ్మకం ఉంటే మా నుంచి ఒక్క షరతు 2012కు ముందు జగన్ రెడ్డి తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.43 వేల కోట్ల అక్రమాస్తులు కూడా గట్టారని సీబీఐ కేసులు నమోదు చేసిందిఆ రోజు సీబీఐ కరెక్ట్ కాదంటూ జగన్మోహన్ రెడ్డి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు బెయిల్ తెచ్చుకుని అప్పటి నుంచి ఇప్పటిదాకా కోర్టులో కేసులు నడుపుతూనే ఉన్నారు దాదాపు 15 సంవత్సరాలుగా కేసులు నడుస్తూనే ఉన్నాయి...అయినా సీబీఐపై నమ్మకం లేదు

బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డి దగ్గర నుంచి చాలా మందిని ముద్దాయిల్ని చేశారు..ఆ కేసులో కూడా సీబీఐ కరెక్ట్ కాదంటూ అందరూ బెయిళ్లు తెచ్చుకుని కోర్టులో కౌంటర్లు దాఖలు చేస్తున్నారు .వైసీపీకి నిజంగా సీబీఐపై నమ్మకముంటే మొదట రూ.43 వేల కోట్లు కట్టేయండిబాబాయి హత్య కేసులో సీబీఐ ముద్దాయిలుగా తేల్చినవారందరినీ కోర్టుకు సరెండర్ చేయండిసీబీఐ కోర్టుకు తెలిపిన వాస్తవాలను అంగీకరించి, కౌంటర్లను వెనక్కి తీసుకోవాలి ఈ రెండు జరిగిన వెంటనే నేను మా నాయకుడు, సీఎం చంద్రబాబు నాయుడిని ఒప్పించి డీఎస్సీపై సీబీఐ విచారణ వేయిస్తాం .డీఎస్సీ అత్యంత పకడ్బందీగా జరిగింది. సీబీఐ విచారణ జరిపించడానికి మా ప్రభుత్వానికి భయం లేదు..మా లోకేష్ బాబుకీ భయం లేదు 16372 ఉపాధ్యాయ పోస్టుల్లో కానీ, స్పోర్ట్స్ కోటాలో కానీ ఎక్కడా అక్రమాలకు ఆస్కారమే ఇవ్వలేదు ఐదేళ్ల తర్వాత నిర్వహించిన డీఎస్సీలో 16372 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందడం చూసి వైసీపీ నేతలు కడుపు మంటతోరగిలిపోతున్నారు .

డీఎస్సీ పై సీబీఐ విచారణ జరిపి క్లీన్ చిట్ ఇచ్చినా, చివర్లో మాకు నమ్మకం లేదు...విచారణ బాగా జరగలేదని అంటారు వైసీపీకి నిజంగా నమ్మకం ఉంటే అక్రమాస్తుల కేసుతో పాటు బాబాయి హత్య కేసు విచారణల్లో సీబీఐ తేల్చిన అంశాలను వాస్తవాలు అని ఒప్పుకోవాలి.

# 9వ జాతీయ స్థాయి నంది నృత్య పోటీలు విజయవంతం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 26**

నంద్యాల సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారంవివేకానందఆడిటోరియంలోనిర్వహించిన 9వ జాతీయ స్థాయి నంది నృత్య పోటీలు విజయవంతంగా ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు, నృత్య విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు..

ఈ కార్యక్రమానికి ప్రముఖ కూచిపూడి నాట్యగురువు డా. వేదాంతం రాధేశ్యామ్ న్యాయనిర్ణేతగా వ్యవహరించగా, రామకృష్ణ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డా. జి. రామకృష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కూచిపూడి విభాగంలో నాట్యగురువులు జె. రేణుక ప్రభాకర్, కె. ప్రతిభా రాజ్ గౌడ్, ఎం. శివచంద్ర మౌళి ఆధ్వర్యంలోని విద్యార్థులు, భరతనాట్యం విభాగంలో సంతోషి విజయ్, సౌభాగ్యలక్ష్మి ఆధ్వర్యంలోని విద్యార్థులు, జానపద విభాగంలో మాల్య బజలి నాయక్ ఆధ్వర్యంలోని విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను నంది మొమెంటోలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డా. పల్లెంశెట్టి సురేష్ మాట్లాడుతూ నృత్య కళలను ప్రోత్సహించడం, యువ కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే నంది నృత్య పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన నాట్యగురువులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# వీ.ఆర్.ఏ లను పర్మనెంట్ చేయాలని అఖిలప్రియ కి వినతిపత్రం



**ఆళ్లగడ్డ పెన్ పవర్ సెప్టెంబర్ 26**

ఆళ్లగడ్డ తాలూకాకు సంబంధించిన వి.ఆర్.ఏ ల డిమాండ్ల కు ప్రభుత్వం సహకరించాలని ధర్నాగా వచ్చి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది..

మొదటిగా పే స్కేల్ ఇవ్వాలని, అలాగే ప్రమోషన్లు ఇవ్వక ఎనిమిది సంవత్సరాలు అవుతుందని, నామినీలుగా ఉన్న వి.ఆర్.ఎ లను, పర్మినెంట్ చేయాలని, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ని కలవడం జరిగింది..

# అనుమతి లేని ధర్నాలు, నిరసనలకు ప్రభుత్వ ఉద్యోగులు దూరంగా ఉండాలి



**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు... జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీస్ ..**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 26**

స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు విజయవాడలో నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతున్న ధర్నా/నిరసన కార్యక్రమానికి ఎటువంటి అనుమతి లేదని నంద్యాల జిల్లా పోలీసు శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు అనుమతి లేని ధర్నాలు, నిరసనలు, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనడం సంబంధిత ఆంధ్రప్రదేశ్ కండక్ట్ సర్వీస్ రూల్స్ మరియు అమలులో ఉన్న ఇతర నిబంధనలకు విరుద్ధంగా ఉండే అవకాశం ఉన్నందున, ఉద్యోగులు ఇటువంటి అనధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీస్ సూచించారు.విజయవాడలో అనుమతి లేకుండా నిర్వహించే ధర్నా లేదా నిరసన కార్యక్రమాలపై పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచుతుంది. అవసరమైన సందర్భాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలు మరియు ఇతర సాంకేతిక పరికరాల ద్వారా కార్యక్రమాల్లో పాల్గొనే వ్యక్తులను గుర్తించే చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.పోలీసుల సూచనలు, అమలులో ఉన్న చట్టాలు మరియు నిబంధనలను ఉల్లంఘిస్తూ అనధికారిక ఆందోళనల్లో పాల్గొనే వారిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసు శాఖ హెచ్చరించింది.

ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిర్వర్తిస్తూ, అనుమతి లేని కార్యక్రమాలకు హాజరుకాకుండా సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధి- సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

**సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశాం.**
**నోటిఫికేషన్ విడుదలకు ముందే ప్రచారం ప్రారంభించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**బుచ్చిరెడ్డిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 26.**

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే కూటమి నాయకులు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈమేరకు శనివారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పాత 5వ కొత్త11వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకొని స్థానికంగా వారికున్న సమస్యలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. అనంతరం వార్డులో అవసరమైన చోట సైడ్ డ్రైన్ లు, రోడ్లకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వార్డు కౌన్సిలర్ ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తి అయినప్పటికీ నిధులను మంజూరు చేసిందని, ఈ వార్డు అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం నలభై లక్షల రూపాయలు మంజూరు చేస్తే స్థానిక కౌన్సిలర్ కేవలం 20 లక్షల రూపాయలు మాత్రమే ఖర్చుపెట్టి మిగిలిన అభివృద్ధి పనులను అసంపూర్తిగా వది లేయడం సరైన పద్ధతి కాదన్నారు. గత ప్రభుత్వంలో మధ్యలో ఆపేసిన పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు సంవత్సరాల కాలంలో ఒక్కొక్కటిగా పూర్తి చేయడం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం మున్సిపల్ భవనాన్ని పూర్తి చేయకుండా బేస్ మెంట్ స్థాయిలోనే వదిలివేయడం జరిగిందన్నారు. అనంతరం నాలుగు కోట్ల రూపాయలతో మున్సిపల్ భవనాన్ని పూర్తిచేసి ప్రజలకు అంకితం చేసామన్నారు. దానికి సంబంధించిన నిధుల వినియోగంపై కూడా ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రజల వద్దకు వచ్చి కల్లబొల్లి హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత మొఖంచాటే సే నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. పట్టణంలో అభివృద్ధి జరగాలంటే ప్రస్తుత ప్రభుత్వానికి మద్దతుగా నిలిచే అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణ అభివృద్ధికి తమ ప్రభుత్వం అంతకుముందే 65 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, ఇప్పుడు 22 కోట్లు మంజూరు అయిందని, త్వరలో మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ మరో 25 కోట్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



ఇందులో ఐదవ వార్డు అభివృద్ధి పనులకు గాను 70 లక్షల రూపాయలు మంజూరు చేసామని, టెండర్లు కూడా పూర్తయిని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా, ఆర్డీఎస్ పథకం ద్వారా పవర్ సప్లై వీటన్నిటిని పూర్తి చేసి బుచ్చిరెడ్డిపాలెం పట్టణ అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రజలు గమనించి రాబోయే ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి, వైస్ చైర్మన్ ఎరటపల్లి శివకుమార్ రెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, మండల టిడిపి నాయకులు యర్రం రెడ్డి గోవర్ధన్ రెడ్డి, టంగుటూరు మల్లికార్జున రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు మోర్ల మురళి, వింజం రామానాయుడు, మునిసిపల్ కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యంగా చెంచు కాలనీలో పోలీసుల తనిఖీలు. ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి

**పాణ్యం పెన్ పవర్ సెప్టెంబర్ 26**

ప్రజల భద్రత, నేరాల నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చెంచు కాలనీలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (కాసో ) నిర్వహించారు.జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీస్ ఆదేశాలమేరకు, నంద్యాల సబ్ డివిజన్ ఏ.ఎస్పీ సుస్మిత ఐపీస్ సూచనలతో పాణ్యం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం సబ్ ఇన్స్పెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి, గడివేముల సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి మరియు సర్కిల్ పోలీస్ సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.కాలనీలోని ఇళ్లను తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలు, నిషేధిత వస్తువులపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నేరాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలు ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలను





గమనించినా ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# సమస్యల పరిష్కారం కోసం వీఆర్ఏల నిరసన

**- పే స్కేల్ అమలు చేయాలి.. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి**
**ప్రభుత్వం తక్షణమే సమస్యలను పరిష్కరించాలి: వీఆర్ఏల డిమాండ్**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**
తమ దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏలు శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వీఆర్వోలు, వీఆర్ఏలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

**ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మధ్యల బాలగురవయ్య, శివ మాట్లాడుతూ..**

వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా వీఆర్ఏలను నియమించాలని, అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

వీఆర్ఏలు గ్రామస్థాయిలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ పలు సేవలను అందిస్తున్నారని, అలాంటి సిబ్బంది సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సి. రమణయ్య, దుర్గాప్రసాద్, వెంకటేశు, మురళి తదితర వీఆర్ఏలు పాల్గొన్నారు.

# వైభవంగా విశ్వబ్రాహ్మణ సంఘం పౌర్ణమి వేడుకలు

## శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారికి ఘనంగా అభిషేకాలు భక్తిశ్రద్ధలతో అన్నదానం



**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 26:**
శ్రీకాళహస్తి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు శ్రీ మోహన్ ఆచార్యులు ఆధ్వర్యంలో పిచ్చాటూరు రోడ్డులోని శ్రీ శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పౌర్ణమి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించడం ద్వారా భక్తి, సేవాభావాలను చాటుకున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులను పలువురు అభినందించారు. సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు.

# ప్రమాదకర మలుపుకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

## వేలవేడుముచ్చివోలు రహదారిపై దండి నరేంద్ర చొరవ

**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్ ,సెప్టెంబర్ 26:**
వేలవేడుముచ్చివోలు రహదారిలోని ప్రమాదకర మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో జనసేన నాయకులు దండి నరేంద్ర సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. తన బృందంతో కలిసి ప్రమాదకర ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారు.
ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ శాఖ డీఈ రాంబాబు, ఏఈ దుర్గేష్ దృష్టికి దండి నరేంద్ర తీసుకెళ్లి, ప్రమాదకర మలుపు వద్ద శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్యపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.
సెప్టెంబర్ 28న ఆర్అండ్‌బీ డీఈ రాంబాబు స్వయంగా ప్రమాదకర ప్రాంతాన్ని పరిశీలించి, ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, అవసరమైన శాశ్వత పరిష్కార చర్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.



ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని దండి నరేంద్ర పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, వేలవేడు నుంచి ముచ్చివోలు వైపు ప్రయాణించే వాహనదారులు ప్రమాదకర మలుపు వద్ద వేగాన్ని తగ్గించి అప్రమత్తంగా ప్రయాణించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రామ్ తాళ్లూరి జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన పేట బ్రదర్స్ మిత్రబృందం

## పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలు నాటుతూ జన్మదిన వేడుకలు





**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 26:**
జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పేట బ్రదర్స్ మిత్రబృందం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్మదిన వేడుకలను సామాజిక సేవా కార్యక్రమంతో నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై తమకున్న బాధ్యతను చాటుకున్నారు.
జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ సూచనల మేరకు రామ్ తాళ్లూరి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. 'సేనాతో సేనాని' కార్యక్రమం ద్వారా సమాజం పట్ల బాధ్యత, సేవా దృక్పథం కలిగిన పలువురు నాయకులను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు, పిఠాపురంలో జనసైనికులతో విస్తృతంగా మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

అదేవిధంగా తెలంగాణలో పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంలో రామ్ తాళ్లూరి చేస్తున్న కృషి అభినందనీయమని జనసేన నాయకులు తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ఆయన నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, గంధం శ్రీను, రమేష్ బాబు, ఆరిఫ్, కల్లిపూడి వెంకటేష్, దినేష్, దివాకర్, సాయి, వీర మహిళ, శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.
"జన్మదిన వేడుకలకు మొక్కలే కానుక.. పర్యావరణ పరిరక్షణే లక్ష్యం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచింది.

# పోలింగ్ కేంద్రాలపై పార్టీలతో సమావేశం

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 26**
నంద్యాల పురపాలక సంఘం పరిధిలో రానున్న ఎన్నికలకు సంబంధించి 52 వార్డులకు 217 పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై మున్సిపల్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న సమావేశం నిర్వహించారు.
రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రూపొందించిన పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే సెప్టెంబర్ 26వ తేదీ శనివారం సాయంత్రం లోగా మున్సిపల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా అందజేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించిన అనంతరం తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు. అదికారులు పాల్గొన్నారు.




# కోలాహలంగా ప్రారంభమైన కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ ..








**- 4500 మందికి పైగా విద్యార్థులతో నాలుగు రోజులు పాటు సందడిగా సాగనున్న స్పోర్ట్స్ మీట్.**
**- కీడోత్సవాల్లో భాగంగా పర్యావరణ కాలుష్యం పై అవగాహనా కల్పిస్తూ..2000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ..**
**- స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై.. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాలను ప్రారంభించిన ..కృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి , ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి .**

**నెల్లూరు సెప్టెంబర్ 26 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో .. కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ లో భాగంగా విద్యార్థులు పర్యావరణ కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. కెవిఆర్ పెట్రోల్ బంక్ నుంచి ఏసి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు.
ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి విద్యా సంస్థల డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్ రెడ్డి విద్యార్థులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.
అనంతరం నెల్లూరు ాజ సుబ్బారెడ్డి స్టేడియంలో కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. ముఖ్య అతిథులుగా విచ్చేసి స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు.
ఈ సందర్భంగా అతిధులకు NCC విద్యార్థులు సాదరస్వాగతంపలికి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. చంద్రశేఖర్ రెడ్డి , డైరెక్టర్ రాణా ప్రమోద్ రెడ్డి విద్యార్థులతో కలిసి.. సరదాగా క్రికెట్ ఆడి. విద్యార్థులను ఉత్సాహపరిచారు.
కృష్ణ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు.. క్రీడల్లో కూడా ప్రోత్సాహం అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి తెలిపారు.అందులో భాగంగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇంటర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ నిర్వహించి.. విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.
గెలుపోటములతో.. సంబంధం లేకుండా.. విద్యార్థులు క్రీడలను స్పోర్టివ్ గా తీసుకోవాలన్నారు.
విద్యార్థులు స్పోర్ట్స్ మీట్ ను చక్కగా వినియోగించుకుని జిల్లా, రాష్ట్రస్థాయిలో కళాశాలకు పేరు తీసుకురావాలని సూచించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..**

కృష్ణ చైతన్య విద్యాసంస్థలు ప్రారంభించి 28 సంవత్సరాలు పూర్తయ్యాయని కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడలు ఇతర కోకరికులం యాక్టివిటీస్ లో ప్రోత్సాహం అందిస్తుండడం అభినందనీయం.
ఇంటర్, డిగ్రీ, పీజీ, కళాశాలల్లో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ఎంతో సంతోషకరమన్నారు.
కృష్ణ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు..చదువుల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటుతూ క్రీడల్లో కూడా మేటిగా రాణిస్తుండడం కృష్ణ చైతన్య విద్యాసంస్థల పనితీరుకు నిదర్శనం అన్నారు. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు పెరిగిపోవడానికి గల కారణం పర్యావరణంపైప్రజలకుఅవగాహనలేకపోవడమేనన్నారు .
ఈ రోజు కృష్ణ చైతన్య కళాశాలల స్పోర్ట్స్ మీట్ లో భాగంగా 2000 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి పర్యావరణ కాలుష్యంపై ప్రజలకు అవగాహనకల్పించడం అభినందనీయమని తెలిపారు.
కృష్ణ చైతన్య విద్యాసంస్థలు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో కృష్ణ చైతన్య విద్యా సంస్థల డీన్ రామాంజనేయులు రెడ్డి , అకాడమిక్ డీన్ రాంగోపాల్ రెడ్డి , అడ్మిన్ డీన్ పాయసం రమేష్ , కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# పంగూరులో ఘనంగా పోషణ మాసోత్సవాలు

## "మన అంగన్‌వాడీ మన బాధ్యత"తో పోషకాహారంపై అవగాహన







**ఏర్పేడు, పెన్ పవర్ ,సెప్టెంబర్ 25:**
ఏర్పేడు మండలం పంగూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం2026, పోషణ ఉత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, ప్రీస్కూల్ చిన్నారులు, తల్లిదండ్రులకు పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమానికి రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరై "మన అంగన్‌వాడీ మన బాధ్యత" అనే నినాదంతో ప్రతి కుటుంబం పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారుల జీవితంలో మొదటి 1000 రోజులు అత్యంత కీలకమైనవని, ఈ దశలో తల్లులు, కుటుంబ సభ్యులు పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వివరించారు.
గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు సమతుల్య ఆహారం, పోషక విలువలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రాధాన్యతను వివరించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వ శాఖలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని తెలిపారు. పిల్లలకు చిన్ననాటి నుంచే పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.
పోషణ మాసోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమేనని సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలకు మరింత చేరువ చేసి, తల్లులుచిన్నారుల ఆరోగ్య సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏర్పేడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ శిరీష, ఏఎన్ఎమ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పంగూరులో ఘనంగా పోషణ మాసోత్సవాలు

**"మన అంగన్‌వాడీ మన బాధ్యత"తో పోషకాహారంపై అవగాహన**





**ఏర్పేడు, పెన్ పవర్ ,సెప్టెంబర్ 26:**
ఏర్పేడు మండలం పంగూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం2026, పోషణ ఉత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, ప్రీస్కూల్ చిన్నారులు, తల్లిదండ్రులకు పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమానికి రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరై "మన అంగన్‌వాడీ మన బాధ్యత" అనే నినాదంతో ప్రతి కుటుంబం పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారుల జీవితంలో మొదటి 1000 రోజులు అత్యంత కీలకమైనవని, ఈ దశలో తల్లులు, కుటుంబ సభ్యులు పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వివరించారు.
గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు సమతుల్య ఆహారం, పోషక విలువలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రాధాన్యతను వివరించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వ శాఖలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని తెలిపారు. పిల్లలకు చిన్ననాటి నుంచే పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.
పోషణ మాసోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమేనని సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలకు మరింత చేరువ చేసి, తల్లులుచిన్నారుల ఆరోగ్య సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏర్పేడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ శిరీష, ఏఎన్ఎమ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బధిర బాలల సందడి ఆత్మవిశ్వాసంతో ఎదగాలి -డాక్టర్ రవి కృష్ణ

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 26**
అయ్యలూరు మెట్ట వద్దనున్న నవజీవన్ బధిరుల ప్రత్యేక పాఠశాలలో అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ మేరీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ అంతర్జాతీయ సంస్థ ఉప జిల్లా గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బధిర విద్యార్థులు వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఉన్నత




స్థాయికి ఎదగాలని డాక్టర్ రవి కృష్ణ సూచించారు.
చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపాలని కోరారు. దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు
అనంతరం బధిర బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంజ్ఞల ఆధారంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేకంగా అలరించాయి. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు పద్మావతమ్మ, రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి రాజీవ్ నగర్ కాలనీలో ఆపరేషన్ త్రిశూల్

## తనిఖీలతో హడలెత్తించిన పోలీసులు.. 78 ద్విచక్ర వాహనాలు, 12 ఆటోలు స్వాధీనం

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 26:**
పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ త్రిశూల్ పేరుతో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో పోలీసులు పెద్ద ఎత్తున వాహనాలను పరిశీలించారు. డ్రగ్స్ వినియోగం, మహిళల భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తనిఖీలు చేపట్టారు.
ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న 78 ద్విచక్ర వాహనాలు, 12 ఆటోలను పోలీసులు తనిఖీ చేసి, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.




**ప్రజల భద్రతే లక్ష్యంగా..**
డ్రగ్స్ వినియోగం, అక్రమ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. మహిళలు, యువత భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

# లబ్ధిదారుల సొంతింటి కల సాకారం

## -ఎస్ఆర్‌బీసీలో నేడు గృహాల తాళాల పంపిణీ



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 26**
నంద్యాల పట్టణ ప్రజలకు తీయటి శుభవార్త. ఏపిటిడ్కో, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఎస్ఆర్‌బీసీ ప్రాంతంలో నిర్మించిన జి+3 గృహాల్లో 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్లను కేటాయించిన లబ్ధిదారులకు ఈ నెల 27న గృహాల తాళాలు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా చేతుల మీదుగా ఉదయం 10 గంటలకు ఎస్ఆర్‌బీసీ లొకేషన్‌లో గృహాల తాళాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులతో పాటు నంద్యాల పట్టణ ప్రజలు, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ బి. శేషన్న కోరారు.

# ఉరుసు మహోత్సవంలో ఘనంగా అన్నదానం..

## ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 26**
నంద్యాల పట్టణం 3వ వార్డులో హజరత్ సయ్యద్ షా బాబా ఫక్రుద్దీన్ హుసేని మరియు హజరత్ సయ్యద్ హుస్సేన్ సావలి ఉరుసు మహోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రజలకు స్వయంగా భోజనాలు వడ్డించారు. అనంతరం ప్రజలతో కలిసి భోజనం చేస్తూ ఆత్మీయంగా మమేకమయ్యారు.
**ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫయాజ్ మాట్లాడుతూ..** ఉరుసు మహోత్సవం సందర్భంగా నిర్వహించే అన్నదానం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ సోదరభావం, ఐక్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దర్గా ఉరుసు మహోత్సవం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు ఇక్బాల్ రెహమాన్, అక్బర్ బాషా, అలీ భాయ్, బాబా, మా భాష, చాంద్ వారిస్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పొదల్లో పసికందు.. ఆదుకున్న మానవత్వం




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 26**
అయ్యలూరుమెట్ట సమీపంలో కనిపించకుండా పోయిన నెల రోజుల పసికందును సకాలంలో గుర్తించి రక్షించిన వ్యక్తిని నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ శ్రీమతి సుస్మిత అభినందించి సత్కరించారు.
సెప్టెంబర్ 5న పసికందుతో కలిసి మహిళ కనిపించకుండా పోవడంతో నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టిన క్రమంలో అయ్యలూరుమెట్ట నుంచి పెద్దకొట్టాల వెళ్లే మార్గంలోని చెట్ల పొదల్లో శిశువు కనిపించింది. అటుగా వెళ్తున్న వ్యక్తి శిశువును గుర్తించి వెంటనే రక్షించి పోలీసులకు సమాచారం అందించారు.
పోలీసులు శిశువును సురక్షితంగా స్వాధీనం చేసుకుని తండ్రి కేడెం శివ నాగరాజుకు చూపించగా, తన కుమార్తెగా గుర్తించారు. శిశువు అక్కడికి ఎలా చేరుకుందనే విషయంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.
శిశువును రక్షించిన వ్యక్తి చూపిన సమయస్ఫూర్తి, మానవతా దృక్పథాన్ని ఏఎస్పీ సుస్మిత అభినందించి సత్కరించడంతో పాటు ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

# మద్యం దుకాణాల టెండర్లకు నోటిఫికేషన్ జారీ

## శ్రీకాళహస్తి పరిధిలో 10 దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**
శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.
శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 3 మద్యం దుకాణాలు, ఏర్పేడు మండల పరిధిలో 3, తొట్టంబేడు మండల పరిధిలో 3, బీఎన్‌కండ్రిగ పరిధిలో 1 దుకాణం చొప్పున మొత్తం 10 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 3 లక్షల దరఖాస్తు రుసుముతో పాటు రూ. 1,000 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తులను ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్ విధానాల్లో సమర్పించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అక్టోబర్ 1 వరకు దరఖాస్తులుఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను అక్టోబర్ 3వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



అక్టోబర్ 5న లాటరీ ద్వారా కేటాయింపుమద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి అక్టోబర్ 5వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ లావణ్య తెలిపారు. లాటరీలో ఎంపికైన అభ్యర్థులకు తదుపరి ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు.
మద్యం దుకాణాల టెండర్లకు సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనలు, దరఖాస్తు విధానం తదితర సమాచారం కోసం శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు.

# 500 మందికి మెగా వైద్య సేవలు




**నంద్యాల ప్రతినిధి సెప్టెంబర్ 26**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలకు సంబంధించి ప్రత్యేక వైద్యులచే సుమారు 500 మందికి ఓపీ సేవలు అందించారు.
కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జిలాని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదాబాయి, డీసీహెచ్ డాక్టర్ ఓ. లలిత, లెప్రసీ డాక్టర్ అంకిరెడ్డి. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్ చంద్రారెడ్డి, డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ శ్రీజ, జిల్లా మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామన్నతో పాటు వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వ్యాఖ్యలపై స్పందించిన కౌన్సిలర్ షాహుల్



**బుచ్చిరెడ్డిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 26.**
మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శనివారం జరిపిన పర్యటనలో స్థానిక కౌన్సిలర్ పై చే సిన వ్యాఖ్యలపై ఆ వార్డు కౌన్సిలర్ షేక్ షాహుల్ స్పందించారు. వార్డు లోని వివిధ అభివృద్ధి పనులకు గాను 40 లక్షల రూపాయలు మంజూరు అయితే 20 లక్షల రూపాయల పనులు చేసి మిగతా పనులు అసంపూర్తిగా వదిలివేశారనే మాట వాస్తవం కాదని, అందులో 20 లక్షల రూపాయలకు మాత్రమే టెండర్లు జరిగాయని, మిగిలిన 20 లక్షల రూపాయలకు టెండర్లు జరగకపోవడంలో తన తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అధికారుల తప్పులు తమ మీద రుద్దటం సరికాదన్నారు. అలాగే తనకు ఇచ్చిన 40 లక్షల రూపాయలు విపిఆర్ ట్రస్టు ద్వారా వచ్చినవి కావని 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా వార్డులోని వివిధ అభివృద్ధి పనులకు గాను వచ్చినవని షాహుల్ వివరించారు. తాను కేవలం రాజకీయ నాయకుడిని మాత్రమేనని, కాంట్రాక్టర్ ను కాదన్నారు. టెండర్ల విషయంలో తన జోక్యం ఏమీ లేదని తెలిపారు. ఎవరో కావాలని తనపై విషపూరితమైన వ్యాఖ్యలు చేయించారన్నారు. గతంలో జరిగిన అభివృద్ధిపై తాను తెలియజేసేందుకు ఏ సమయంలోనైనా సిద్ధంగా ఉన్నానన్నారు. 40 లక్షల రూపాయలతో సచివాలయ భవనం పూర్తి చేసినప్పటికీ, ఎన్నికలు రావడంతో దానిని అప్పటి ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి చేత ప్రారంభించ లేకపోయామన్నారు. బెజవాడ గోపాల్ రెడ్డి నగర్ లో 40 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. కామాక్షి కాలనీలో, పల్లెపాలెం లో సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడే ముందు స్థానిక కౌన్సిలర్లు ఏమి చేశారో, ఏమి చేయలేదో తెలుసుకొని మాట్లాడటం మంచిదని కౌన్సిలర్ షాహుల్ హితవు పలికారు.

# తండ్రికి తల కొరివి పెట్టిన ఇద్దరు కూతుర్లు.

**- కూతుర్లే కొడుకుగా మారి తండ్రికి దహన సంస్కారాలు.**
**- తండ్రి చివరి చూపు కోసం అమెరికా నుంచి ఇండియాకు ప్రయాణం**

**పెన్ పవర్, సెప్టెంబర్ 26:**
జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తండ్రికి ఇద్దరు కూతుళ్లు కన్నీటితో వీడ్కోలు పలికిన హృదయ విదారకమైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, బయ్యారం గ్రామంలో చోటుచేసుకుంది. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నందు ఉద్యోగిగా పనిచేస్తున్న దొడ్డ రాజశేఖర్ రెడ్డి (సంతోష్ రెడ్డి) తన గృహంలో అకస్మాత్తుగా బాత్రూంలో కాలుజారి కింద పడటం వలన తలకు తీవ్రమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకోవడం జరిగింది. హుటాహుటిన అంబులెన్స్ నందు వైద్య సేవ నిమిత్తం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో తుది శ్వాస విడిచారు. మృతుడికి భార్య నాగశ్రీ, ఇద్దరు ఆడపిల్లలు ప్రతిమ, ప్రణీత. తండ్రి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తండ్రి మరణ వార్త విన్న కూతురు ప్రతిమ అమెరికా నుంచి హుటాహుటిన ఇండియాకు వచ్చారు. చిన్న కూతురు ప్రణీత ఉద్యోగరీత్యా చెన్నైలో ఉండగా తండ్రి మరణ వార్త విని రావడం జరిగింది. జీవితాంతం తమను ప్రేమగా చూసుకోవాల్సిన తండ్రికి చివరి వీడ్కోలు పలికే సమయంలో కూతుళ్లు భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి అంతిమ సంస్కారాల బాధ్యతను ఇద్దరు కూతుర్లు స్వీకరించి, సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు. తండ్రి పార్థివదేహానికి నివాళు లర్పించిన అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్న ఇద్దరు కూతుళ్లు శ్మశానవాటికలో తండ్రికి తలకొరివి పెట్టారు. కన్నీటి పర్యంతమవుతూ తండ్రికి చివరి వీడ్కోలు పలికిన దృశ్యం అక్కడున్న బంధువులు, స్థానికులను తీవ్ర భావోద్వేగానికి గురిచేసింది. తండ్రికి చివరి కర్మలు నిర్వహించడంలో కూతుళ్లు కూడా ముందుండగలరని చాటుతూ, తమ తండ్రి పట్ల ఉన్న ప్రేమ, బాధ్యతను చాటుకున్నారు. అమెరికా, చెన్నైలో ఉద్యోగరీత్యా స్థిరపడ్డా కూడా తండ్రి మీదున్న ప్రేమతో... బాధతో, బాధ్యతగా దహన సంస్కారాలు నిర్వహించడంతో ఇద్దరు కూతుర్లను గ్రామస్తులు, బంధువులు అభినందించారు.



# పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్





**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**
ఈనెల 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వద్ద రగుడు బై పాస్ రోడ్ వద్ద పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్న పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి శనివారం పరిశీలించారు.
మీటింగ్ కోసం స్థలాన్ని చదును చేసే పనులు కొనసాగుతుండగా, పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించారు. వివిధ వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.
పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి : అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్య



**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**
గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్య సూచించారు. గురువారం కందుకూరు మండలం మాన్యగూడ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, కల్యాంకర్ అనిత ఆధ్వర్యంలో పోషణ్, పోషకాల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.
అనంతరం సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, జీరో ట్రాక్ వ్యాధులను కూడా నయం చేయవచ్చని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఏటా సెప్టెంబర్ నెలలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాల వారోత్సవాలు, పోషణ్ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. గర్భిణులు, మహిళలు, ఆరేళ్ల లోపు పిల్లలకు వ్యాధులు రాకుండా పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు

# లోకేశ్వరం మండలం గ్రామం బిలోలి

**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**
సెప్టెంబర్ పర్యావరణ కాలుష్యం నుంచి నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం గ్రామం బిలోలి గ్రామపంచాయతీ వినూత్న ఉపక్రమించింది ప్లాస్టిక్ వద్దు పరిశుభ్రత ముద్దు నినాదంతో శనివారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించడమే లక్ష్యంగా ఎంపీ ఓ సల్మాన్ రాజ్ సర్పంచ్ టీ నివేదిత రాజశేఖర్ రావు సెక్రెటరీ బి ప్రత్యూష ఉపసర్పంచ్ కదారి రాజశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు

# చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ధీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నాంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. భూస్వామ్య దోపిడీ వెట్టిచాకిరీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని కత్తి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అన్యాయాన్ని ఎదిరించి పేదలు రైతులు కూలీల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. మహిళా ధైర్యానికి ఆత్మగౌరవానికి పోరాట స్ఫూర్తికి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ సమాజంలో సమానత్వం సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నాడు



# పశుసంపద, కోళ్లపై ఎల్‌నినో ప్రభావం నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం.




**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**

శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవా పథకం, ఎన్టీఆర్ పశువైద్య కళాశాల, గన్నవరం వారి ఆధ్వర్యంలో పశుసంపద మరియు కోళ్ల పెంపకంపై ఎల్‌నినో ప్రభావం మరియు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రొఫెసర్ వై రమణారెడ్డి అసోసియేట్ డీన్ వారి అధ్యక్షతన దావాజీ గూడెం, స్వర్ణ అల్లాపురం, అజ్జం పూడి, భూతమిల్లిపాడు గ్రామములనందు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితుల్లో పశువులు మరియు కోళ్ల ఆరోగ్యం, ఉత్పాదకతను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు మరియు పశుసంవర్ధక శాఖ జారీ చేసే ముందస్తు హెచ్చరికలను రైతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితుల కారణంగా ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం, వర్షపాతం అస్థిరంగా ఉండటం వంటి పరిస్థితులు పశు సంపద మరియు పౌల్ట్రీ రంగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షేక్ మస్తాన్ బి మాట్లాడుతూ, అధిక ఉష్ణోగ్రతల వల్ల పశువుల్లో ఆహారం తీసుకునే పరిమాణం తగ్గడం, పాల దిగుబడి మరియు పునరుత్పత్తి సామర్థ్యంలో మార్పులు, నీటి అవసరం పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. పశు వులకు రోజంతా స్వచ్ఛమైన, చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచాలని, తీవ్రమైన ఎండ సమయంలో పశువులను బయటకు తీసుకెళ్లకుండా, మేతను ఉదయం మరియు సాయంత్రం వేళల్లో అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ, సమతుల్యమైన పోషకాహారం అందించడంతో పాటు పశువుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి మరియు వేడి ఒత్తిడి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే పశువైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వసంతకుమారి, పశుపోషకులు, కోళ్ల పెంపకందారులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# శనివారం రోజున పోటెత్తిన భక్తులు

**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**



అనుమాస్పల్లి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న తదితరులు

శనివారం సందర్భంగా అనుమాస్పల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ గుప్తా, రావుల శివ, రాజు గౌడ్, కంబాల రామకృష్ణ, బుచప్ప , దేగరి కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శనివారం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే సారు.... పోడు గోడు.. వినండి...!



**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**

– పోడు సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయం కు గ్రామస్తుల వినతి...!

– 20 సంవత్సరాలుగా అధికారుల కేసులు... గ్రామ ప్రజల ప్రదక్షిణలు.

గడిచిన 20 సంవత్సరాలుగా బొమ్మరాజు పల్లి గ్రామాల పోడు వివాదాన్ని ప్రభుత్వం, అధికారులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవట్లేదు. ఎన్నికలు జరగటం ,ప్రభుత్వాలు మారటం ముఖ్యమంత్రులు పోడు భూములకు పట్టాలిస్తాము అధికారికంగా గుర్తిస్తామని వాగ్దానాలు చేస్తూ వారి అధికార దాహాన్ని తీర్చుకుంటున్నారు తప్ప రెండు గ్రామాల పోడు సమస్యలను గుర్తించట్లేదని పోడు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా పెంటన్నగూడెం – బొమ్మరాజు పల్లి గ్రామాల మధ్య పోడు సమస్య అనేక ఉద్రిక్తతల, వివాదాల నడుమ అనేక సంవత్సరాలుగా పోడు రైతుల రక్తంతో నెత్తురోడుతున్న కూడా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్యని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

– ఎమ్మెల్యే పాయం నాడు అరకపట్టి దున్నిన భూమి :

25 హెక్టార్ల భూమిని పోడు కొట్టుకున్న రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని నేటి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆనాడున సిపిఎం ఎమ్మెల్యేగా పార్టీలో ఉండి రైతుల సమక్షంలో అరక పట్టి పోడు భూమిని దున్నడం జరిగింది. 20 సంవత్సరాలుగా వివాదాల నడుమ కొనసాగుతున్న ఈ పోడు భూమి సమస్య ఎమ్మెల్యే పాయం దృష్టిలో ఎప్పటినుంచో ఉంది. ప్రభుత్వం ద్వారా అధికారుల సహకారంతో రెండు గ్రామాల రైతుల పోడు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– గిరిజనులకు వ్యతిరేకం కాదు: పెంటన్నగూడెం గ్రామస్తులు.

రెండు గ్రామాల మధ్య నలుగుతున్న ఈ పోడు సమస్యను కులాల మధ్య చిచ్చుగా పరిగణించవద్దని... ఎట్టి పరిస్థితుల్లో గిరిజనులకు మేము వ్యతిరేకం కాదన్న పెంటన్నగూడెం గ్రామస్తుల వాదనను పరిగణలోకి తీసుకొని పోడు భూమిని చదును చేసుకున్న రైతుల వివరాలు ఆధారంగా గిరిజన రైతులకు, హరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇప్పించి తమ జీవనాధారాన్ని దూరం చేయకుండా పోడు రైతుల సమస్యను తీర్చాలని రెండు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

– కార్పొరేషన్ డిపార్ట్మెంట్ కేసులు...! అధికారులకు విన్నపాలు...!

కార్పొరేషన్ డిపార్ట్మెంట్ కు సంబదించిన దమ్మక్కపేట బీట్ లో ఉన్న 25 హెక్టార్ల భూమిని పెంటన్నగూడెం –బొమ్మరాజు పల్లి గ్రామాల రైతులు పోడు భూమి నరికి,నాగల్లు దున్నడం, పోడు భూమిలో గుడిసెలు వేయటం అటవీ శాఖ అధికారులు కూలగొట్టడం జరిగింది. వ్యవసాయం చేసే పోడు రైతులకు అధికారుల తీరు సమస్యగా మారింది. ఎంతో కష్టపడి సాగు చేసుకుంటున్నా... పోడు భూమిపై కార్పొరేషన్ అధికారులు పలుమార్లు రైతులపై దాడి చేసి కేసులు పెట్టడం జరిగింది. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగటం ఆ రెండు గ్రామ ప్రజలకు అలవాటుగా మారింది.పోడు సమస్య పరిష్కారం దిశగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అధికారుల సహకారంతో పట్టాలి ఇప్పించాలని ముక్తకంఠంతో రెండు గ్రామ ప్రజల పోడు రైతులు వేడుకుంటున్నారు.

# 15వ వార్డు లో జరిగిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**

ఎమ్మెల్యే జులకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా మాచర్ల పట్టణంలోని 15వ వార్డులో ప్రభుత్వ పథకాలు, పింఛన్లు లబ్ధిదారులకు అందిస్తున్న వివరాలను ఆశావాహులకు వివరిస్తూ సమస్యల పరిష్కారానికి భరోసా కల్పిస్తూ ప్రజల చైతన్య పరుస్తూ నాయకులు మాచర్ల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సీనియర్ నాయకులు యాగంటి మల్లిఖార్జున రావు, జిల్లా ఆర్యవైశ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరె యల్లమంద, బూత్ ఇంచార్జ్ బండ్ల బ్రహ్మం, మాచర్ల పట్టణ ప్రధానకార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, బృంగా బాబు, రాయపాటి శ్రీనివాసరావు, చందు గౌడ్




మనోజ్ మరియు 15 వార్డ్ లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# అధ్వానంగా తమిరిశ పోలుకొండ రహదారి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్న రోడ్డు

**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**




నందివాడ మండలంలోని తమిరిస నుండి పోలుకొండ వెళ్లే జి పి కే రోడ్డు శిధిలావస్థకు చేరి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తుంది. 6 కిలోమీటర్ల మేర రోడ్డు శిధిలావస్థకు చేరి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుడివాడ నుండి పోలుకొండ వరకు 13 కిలోమీటర్ల మేర ఉన్న జి పి కే రోడ్డును గత ప్రభుత్వ హయాంలో తమిరీసా వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించి మిగతా రోడ్డును నిర్మించకుండా అసంపూర్తిగా వదిలేశారు. మిగిలిన రోడ్డు ప్రస్తుతం శిధిలమై పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తుంది. రోడ్డుపై రాళ్లు లేచి ప్రయాణకాలకు ఇబ్బందికరంగా మారింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి వీలు లేకుండా మారింది. పరిసర ప్రాంతాల్లో ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చెందడంతో ప్రతినిత్యం వందల సంఖ్యలో వాహనాలు రోడ్డుపై ప్రయాణిస్తున్నాయి. భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా మారింది. మామూలు సమయాల్లో వెళ్లడానికే నానా బాధలు పడే ప్రయాణికులు చిన్నపాటి వర్షం వస్తే రోడ్డుపై ప్రయాణానికి నరకం చూస్తున్నారు. గుంతల్లో నీరు చేరి ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా పరిసర ప్రాంతాల నుండి ప్రతినిత్యం గుడివాడకు చదువులు వ్యాపార నిమిత్తం విద్యార్థులు పరిసర ప్రాంత వాసులు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. రోడ్డు మరింత దారుణంగా ఉండడంతో ప్రయాణాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రోడ్డును నిర్మించగా అప్పటినుండి ఇప్పటివరకు రోడ్డు అభివృద్ధిని అటు అధికారులు ఇటు పాలకులు నిర్లక్ష్యం చేయడంతో ప్రయాణాలు నరకప్రాయంగా మారాయి. మారుమూల రోడ్డు సైతం ప్రస్తుతం నిర్మిస్తున్న దాదాపు పదుల సంఖ్యలో గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉన్న జి పి కే రోడ్డు నిర్మాణాన్ని పాలకులు అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పరిసర ప్రాంత గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మాజీ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు రోడ్డు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడం పట్ల పరిసర ప్రాంత గ్రామస్తులు గత ఎన్నికల్లో నానికి వ్యతిరేకంగా ఓటు వేశారనే వార్త అప్పట్లో హల్చల్ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్న ఇప్పటివరకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టక పోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు అభివృద్ధిని విస్మరిస్తే వచ్చే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి పరిసర ప్రాంత గ్రామాల నుండి వ్యతిరేక ఓటు పడే అవకాశాలు ఉన్నాయి. రోడ్డు దారుణంగా ఉన్న కనీసం ఆర్ అండ్ బి శాఖ అధికారులు కనీస మరమ్మత్తుల సైతం చేపట్టడం లేదని పరిసర ప్రాంత గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి మరమ్మత్తుల సైతం చేపట్టడం లేదని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలకులు రోడ్డు నిర్మాణం పట్ల శ్రద్ధ చూపి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# పర్యాటక అభివృద్ధికి మంచిర్యాల జిల్లాలో అపార అవకాశాలు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**




ప్రకృతి వనరులు, పర్యావరణ సమతుల్యత, చారిత్రక, ఆధ్యాత్మిక, సాహస పర్యాటకానికి జిల్లాలో అపార అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వేడుకలకు జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, జిల్లా పర్యాటక నోడల్ అధికారి & ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు లతో కలిసి హాజరై మంచిర్యాల జిల్లా పర్యాటక స్థలాల గురించి జిల్లా టూరిజం నోడల్ ఆఫీసర్ & ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తయారు చేసిన మంచిర్యాల టూరిజం డిపార్ట్మెంట్ లోగోతో పాటు టూరిజం మ్యాగజైన్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు ఉన్న సామర్థ్యంతో పోలిస్తే ప్రస్తుతం పర్యాటకుల రాక తక్కువగా ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను విస్తృతంగా ప్రచారం చేసి పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరాలను మ్యాగజైన్‌తో పాటు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎకో టూరిజంతో పాటు టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామని, సాహస పర్యాటకానికి అనువైన ప్రాంతాలలో రాక్ క్లైంబింగ్ వంటి కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు, శివ్వారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వంటి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశాలను పరిశీలించాలని, తాడోబా వైపు వెళ్లే మార్గంలో మంచిర్యాల జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యాటకం ద్వారా వచ్చే ఆదాయాన్ని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సముచితంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యార్థులను వివిధ పర్యాటక ప్రదేశాలకు ఎక్స్కర్షన్‌లకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు పర్యాటకంపై క్విజ్‌లు, పోటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా పర్యాటక ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించవచ్చని, ప్రజలు, అధికారులు, సంబంధిత శాఖలు సమిష్టిగా కృషి చేస్తే జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని తెలిపారు.

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు కొనసాగుతున్నాయని, గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గాంధారి ఖిల్లా, సింగరేణి సంస్థ ద్వారా నల్ల బంగారమైన బొగ్గు నిల్వల వెలికితీత వంటి జిల్లాలోని చారిత్రక, పారిశ్రామిక విశేషాలను పర్యాటక రంగం ద్వారా ప్రజలకు పరిచయం చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. పర్యాటక ప్రదేశాలు ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు చారిత్రక, సాంస్కృతిక అంశాలను ప్రాచుర్యంలోకి తీసుకువస్తాయని తెలిపారు. జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురాతన మాన్యుస్క్రిప్టులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని, వాటిని సంరక్షించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా జిల్లాలోని చారిత్రక వారసత్వాన్ని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావచ్చని తెలిపారు. వివిధ పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలో పర్యాటకంపై నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు జనానికి అంకితం.. కుటుంబానికి దూరం

25 ఏళ్ల జర్నలిజం ప్రస్థానం.. నేడు ఆసుపత్రి పాలైన సీనియర్ జర్నలిస్టు...
జనం కోసం కలం పట్టాడు.. నేడు కుటుంబం కోసం చేయూత కోరుతున్నాడు..
25 ఏళ్ల జర్నలిజం.. నేడు ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు..

**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు.. కరీంనగర్ చల్మడ ఆనందరావు ఆసుపత్రిలో చికిత్స

భార్య, ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఆర్థిక సహాయం కోరుతున్న కుటుంబం..

జగిత్యాల జిల్లా కేంద్రం..జనం సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ.. ప్రజల గొంతుకగా నిలుస్తూ.. గత 25 ఏళ్లుగా జర్నలిజం వృత్తినే నమ్ముకుని ముందుకు సాగుతున్న సీనియర్ జర్నలిస్టు గాజుల నాగరాజు నేడు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జర్నలిస్టుల కోసం పనిచేస్తూ.. పలు కీలక పదవుల్లో కొనసాగిన నాగరాజు, జగిత్యాల జిల్లా ఏర్పడిన తర్వాత కూడా జిల్లా స్థాయిలో బాధ్యతలు నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో, ముఖ్యంగా అక్రిడిటేషన్లు, బస్ పాసులు తదితర అంశాల్లో ఎంతోమందికి సహాయం అందించారు.

ప్రతి జర్నలిస్టును “అన్నా“ అంటూ ఆప్యాయంగా పలకరించే నాగరాజు.. తన జీవితంలో ఎక్కువ భాగాన్ని జర్నలిజానికే అంకితం చేశారు.

అయితే.. జర్నలిజాన్నే నమ్ముకుని జీవించిన ఆయన కుటుంబం మాత్రం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. సొంత ఇల్లు లేదు.. భూమి లేదు.. ఆర్థికంగా వెనుకబడి ఉన్న పరిస్థితుల్లో భార్య, ఇద్దరు ఆడపిల్లల బాధ్యతలను మోస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు.

ఇటీవల నాగరాజు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించగా.. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం కరీంనగర్‌లోని చల్మడ ఆనందరావు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రస్తుతం నాగరాజు చికిత్స కోసం రోజుకు వేల రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇప్పటికే కుటుంబంపై అప్పులు ఉన్నాయి. మరోవైపు ఇంటి అద్దె, నిత్యావసరాలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు.. ఇలా కుటుంబంపై ఆర్థిక భారం మరింత పెరిగింది.

నాగరాజు భార్య బీడీలు చుడుతూ రోజుకు వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఒకవైపు భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. మరోవైపు ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందోనని ఆ కుటుంబం ఆందోళన చెందుతోంది.

జర్నలిజం కుటుంబంలో మనలో ఒకరిగా ఉన్న నాగరాజు కుటుంబం ప్రస్తుతం మన అందరి సహాయాన్ని ఆశిస్తోంది.

జగిత్యాల పట్టణ ప్రెస్ క్లబ్ సభ్యులు ఇప్పటికే తమ వంతుగా కొంత ఆర్థిక సహాయం అందించారు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న వైద్య ఖర్చులకు ఆ సహాయం సరిపోవడం లేదు.

కాబట్టి జగిత్యాల జిల్లాలోని ప్రతి జర్నలిస్టు.. నాగరాజు కుటుంబ పరిస్థితిని తమ కుటుంబ సమస్యగా భావించి, తమకు చేతనైనంత ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి.

మన చిన్న సహాయం.. ఆ కుటుంబానికి పెద్ద భరోసా కావచ్చు.మన చేయూత.. ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తుకు ఒక ఆశాకిరణం కావచ్చు.జర్నలిస్టుల కోసం ఎన్నో సందర్భాల్లో ముందుండి పనిచేసిన గాజుల నాగరాజుకు.. ఈ కష్ట సమయంలో జర్నలిస్టు సమాజం అండగా నిలవాల్సిన సమయం ఇది.

ఆపదలో ఉన్న సహచర జర్నలిస్టు కుటుంబానికి మన వంతు చేయూత అందిద్దాం.. ఆ కుటుంబంలో మళ్లీ ఆశలు నింపుదాం.



# పేదలకు అండగా ఎమ్మెల్యే మద్దిపాటి

**. పెన్ పవర్ సెప్టెంబర్ 26**

జగన్నాథపురంలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న 20 పేద కుటుంబాలకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. సొంత ఖర్చులతో ఆయన ఈ సాయం చేశారు. శనివారం గ్రామ కూటమి నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సరుకులను పంపిణీ చేశారు. సాయం అందుకున్న కుటుంబాలుఎమ్మెల్యేకుకృతజ్ఞతలు తెలిపాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులతో దోస్తీ.. జగన్ ప్లాన్ అదేనా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎప్పుడూ లేని విధంగా ఊహించని పరిణామాలు తెరపైకి వస్తున్నాయి. మొన్నటి వరకు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించుకున్న శత్రు శిబిరాలు, ఇప్పుడు ఒక్కతాటిపైకి వచ్చే సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహారశైలిలో వస్తున్న ఈ అనూహ్య మార్పులు రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. ఇంతకాలం కమ్యూనిస్టు పార్టీలను, ముఖ్యంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను తీవ్రంగా వ్యతిరేకించిన జగన్, ఇప్పుడు అదే వర్గంతో సాగిస్తున్న మంతనాలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

గతంలో ఎన్నడూ లేని విధంగా సీపీఐ నేతలు నేరుగా తాడేపల్లికి వెళ్లి జగన్‌ను కలవడం, రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ఈ నెల 26న విజయవాడలో నిర్వహించబోయే తమ రౌండ్ టేబిల్ సమావేశానికి ఆహ్వానించడం కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాదనేది స్పష్టమవుతోంది. ఈ పొత్తుల పరతంత్ర వెనుక జాతీయ స్థాయి 'ఇండియా' కూటమి పెద్దల వ్యూహం ఉందన్న వాదన బలపడుతోంది. ఏపీలో ఒంటరి పోరాటం చేస్తున్న తమ పార్టీకి జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టడంతో పాటు, కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి వైపు జగన్‌ను ఆకర్షించేలా కమ్యూనిస్టులను మధ్యవర్తులుగా మారుస్తున్నారనే చర్చ జరుగుతోంది.

మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో ఇప్పటివరకు సత్సంబంధాలు కొనసాగించిన జగన్.. ఇప్పుడు తన వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయాక, తనపై ఉన్న కేసుల విచారణను, ఈడీ దూకుడును తట్టుకోవడానికి ఆయన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అయితే ఇప్పుడు కమ్యూనిస్టులతో చేతులు కలపడం ద్వారా ఢిల్లీ పెద్దలకు ఒక బలమైన సంకేతం పంపుతున్నారనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. అవసరమైతే కాంగ్రెస్ కూటూమితో జతకట్టడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాలు పంపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చే రాజకీయ బ్లాక్‌మెయిలింగ్ వ్యూహానికి జగన్ తెరతీశారా అనే అనుమానాలు బలపడుతున్నాయి.

ఏదేమైనప్పటికీ, ఈ రాజకీయ మార్పులు కేవలం స్వల్పకాలిక ప్రయోజనాలకే పరిమితం కాకపోవచ్చు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీతో ఉన్న తీవ్ర విభజనల మచ్చను, సిద్ధాంత వైరుధ్యాలను పక్కనపెట్టి జగన్ వేస్తున్న ఈ అడుగులు భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో చూడాలి. ప్రస్తుతానికి బీజేపీని అప్రమత్తం చేయడానికి, జాతీయ స్థాయిలో తన ఉనికిని చాటుకోవడానికి కమ్యూనిస్టులను జగన్ ఒక ఆయుధంగా వాడుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. ఈ కొత్త దోస్తీ కేవలం తాత్కాలిక రాజకీయామా లేక రాబోయే ఎన్నికల నాటికి మహా కూటమికి పునాదా అన్నది కాలమే నిర్ణయించాలి.

# రాప్తాడు స్థానిక ఎన్నికల్లో వైసీపీ పట్టెంత.. ?




**హైదరాబాద్ పెన్ పవర్:** అనంతపురంజిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఒకప్పుడు వైసీపీ ప్రభావం ఉన్నా.. ఇప్పుడు దాదాపు కనుమరుగైందన్న వాదన వినిపిస్తోంది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాప్తాడు మండల పరిషత్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసింది. రాప్తాడు మండల పరిషత్‌కు సంబంధించిన స్థానిక ఎన్నికల ఫలితాలను గమనిస్తే.. రాప్తాడు మండల పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గం పరిధిలో మొత్తం 11 స్థానాలు ఉన్నాయి. వీటిలో వైసీపీ ఏకంగా 9 స్థానాలను గెలుచుకుంది.ఎన్నికైన ఈ 11 మంది సభ్యులలో ఏడుగురు మహిళలు కావడం విశేషం. ఇదిలా ఉంటే, 2024 లో జరిగిన సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం రాప్తాడు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత విజయం సాధించగా, వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా గత వైభవాన్ని తిరిగి సాధించేందుకు.. తోపుదుర్తి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే మండలాల స్థాయిలో రాజకీయాల వేగం పెంచారు.నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారాయి. రాప్తాడు మండలం రాజకీయ బలాబలాలు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో టీడీపీ కేడర్ బలంగా పుంజుకుంది. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు పరిటాల శ్రీరామ్ ఇక్కడ విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు.మరోవైపు, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ వర్గం రైతుల విద్యుత్ సమస్యలపై నిరసనలు తెలుపుతూ కేడర్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది.రామగిరి: పరిటాల కుటుంబానికి రామగిరి ఒకప్పుడు అత్యంత బలమైన కోట. అయితే, గత కొన్నేళ్లుగా ఇక్కడ తోపుదుర్తి వర్గం కూడా గట్టి పోటీ ఇస్తోంది. ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే.. ఇరువర్గాల మధ్య తరచూ స్థానిక వివాదాలు, సవాళ్లు ప్రతిసవాళ్లతో రాజకీయ వాతావరణం ఎప్పుడూ వేడెక్కి ఉంటోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకుల పట్టు ఇక్కడ మళ్లీ పెరిగింది.కనగానపల్లి: ఈ మండలంలో గ్రామ స్థాయి రాజకీయాలు చాలా చురుగ్గా ఉంటాయి. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆత్మకూరు: ఈ మండలంలో విద్యా, మౌలిక వసతుల కల్పన వంటి స్థానిక సమస్యలపై ఇక్కడ రాజకీయం నడుస్తోంది. ప్రభుత్వ నిధులతో ఇక్కడి పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి టీడీపీ ప్రాధాన్యత ఇస్తుండగా, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ స్థానిక రైతాంగ సమస్యలపై గళమెత్తుతోంది.చెన్నేకొత్తపల్లి: ఈ మండలంలో ఫ్యాక్షన్ ఛాయలు, పాత రాజకీయ కక్షలు అంతర్గతంగా ప్రభావం చూపుతుంటాయి. దీంతో స్థానిక ఎన్నికల్లోనూ ఈ ప్రభావం పడే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే.. మొత్తంగా రాప్తాడులో టీడీపీ తన సత్తాను మరోసారి నిరూపించుకునే ప్రయత్నం చేస్తుండగా.. వైసీపీ నేత తోపుదుర్తి తన ప్రతిష్ఠను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు.

# ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు తీసుకుంటున్న జనసేన

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 26 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది.ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కల్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కల్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కల్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కల్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కల్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.ప్రపంచ పటాలు పరిశీలించండి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో



భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కల్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు.వంద శాతం స్టయిక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళు న్నారు.ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కళ్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

# ఏటీఎంలలో దుర్గమ్మ ప్రసాదం

**విజయవాడ, సెప్టెంబర్ 26 పెన్ పవర్:** రాష్ట్రంలో మొదటిసారిగా దుర్గమ్మ దేవస్థానంలో ప్రసాదం ఏటీఎంను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందన్నారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్. ఖ్యూ× ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపి క్షణాల్లో ప్రసాదం పొందేలా రూపొందించారు. ప్రస్తుతం ట్రయల్ రన్ గా ఏర్పాటు చేశామని..పనితీరు పరిశీలించిన తర్వాత భక్తుల రద్దీ అధికంగా ఉండే ఇతర ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం అన్నారు. ఉత్సవాల రద్దీ సమయంలోనే కాదు సాధారణ రోజుల్లోనూ సులువుగా లడ్డూ ప్రసాదం పొందొచ్చన్నారు. మరోవైపు ఫేక్ పూజా టికెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ కె. రామచంద్ర మోహన్. దేవాలయ దర్శనాలు, సేవల పేరిట దళారుల ప్రమేయాన్ని ఉపేక్షించేది లేదన్నారు. విజయవాడలో ఇటీవల వెలుగుచూసిన ఫేక్ పూజా టికెట్ల వ్యవహారంపై దేవస్థానం అధికార యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ సేవలను కేవలం ప్రభుత్వం, దేవస్థానం అధికారికంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లు, డిజిటల్ యాప్‌లు , అధీకృత కౌంటర్ల ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పారదర్శకంగా సేవా టికెట్లు పొందాలని, దళారులను ప్రోత్సహించవద్దన్నార.ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎండ, వర్షాల బారిన పడకుండా షెడ్ల నిర్మాణం, నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

# అంబటి రాంబాబును వెంటాడుతున్న ఈడీ..!

**గుంటూరు సెప్టెంబర్ 26 పెన్ పవర్:**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు.మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబును విచారణ సెగ గట్టిగానే వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు ఇప్పటివరకు ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మొదటగా సెప్టెంబర్ 18న అంబటి రాంబాబుకు తొలిసారిగా ఈడీ నోటీసులు వెళ్లాయి. సెప్టెంబర్ 24న తమ ముందు హాజరుకావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పాత తేదీలతో ఉన్న నోటీసులు పంపారంటూ అంబటి రాంబాబు పేర్కొన్నారు.చట్టపరమైన సలహా తీసుకునేందుకు వీలుగా తనకు కొత్త నోటీసు ఇవ్వాలని ఆయన కోరారు. అంబటి రాంబాబు అభ్యర్థన మరియు మునుపటి గడువు ముగిసిన నేపథ్యంలో, ఈడీ అధికారులు సెప్టెంబర్ 24న మరోసారి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు. మద్యం డిపోల నుండి షాపులకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకున్న కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి.ఒకవేళ విచారణ పేరిట ఈడీ కఠిన చర్యలు తీసుకోవడం గానీ, అరెస్టు చేయడం గానీ చేస్తే.. దాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించి విక్టిమ్ కార్డ్ ఉపయోగించాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేంద్రంలో ఉన్న పవర్, విచారణ సంస్థల వద్ద లభించిన దస్త్రాల ఆధారంగా చట్టపరంగా ముందుకెళ్తున్న ఈడీపై ఇలా రాజకీయ రంగు పూయడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, రాజ్యాంగబద్ధమైన కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరును, వారి వద్ద ఉన్న పక్కా మనీ-ట్రయల్ ఆధారాలను తక్కువ అంచనా వేయడం వల్లే అంబటి ఈ తరహా గేమ్స్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆరోగ్య నెపంతో సమయం దాటవేసే రాజకీయాలు ఎంతో కాలం నిలబడవు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సాక్ష్యాలు, బినామీల వాంగ్మూలాలు ఇప్పటికే ఈడీ చేతిలో ఉన్నందున తప్పించుకునే ప్రయత్నాలు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈడీ బిగించే ఆర్థిక చక్రబంధం ముందు రాజకీయ ప్రదర్శనలు, ప్రెస్ మీట్లు పనిచేయవని, చట్టబద్ధమైన ప్రక్రియకు హాజరై తన తాను చెప్పే 90 ఎంఎల్ కథలు నిరూపించుకోకపోతే టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా రేట్లను భారీగా పెంచడం ద్వారా కోట్ల రూపాయల నిధులు దారిమళ్లాయనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీల వివరాలు, ఆస్తుల పత్రాలతో సహా విచారణకు రావాలని ఈడీ అధికారులు అంబటి రాంబాబును ఆదేశించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులను అరెస్ట్ చేసిన ఈడీ, అంబటి రాంబాబు విచారణ ద్వారా మరిన్ని కీలక రహస్యాలను ఛేదించాలని భావిస్తోంది.

# కొత్త జెన్ జీ ఓటర్లు....మూడు కోట్ల మంది

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26, పెన్ పవర్:** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) 2025లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను ప్రారంభించినప్పటి నుంచి 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల ( కేటగిరీకి చెందిన దాదాపు 2.73 కోట్ల మంది కొత్తగా ఓటర్ల జాబితాలో చేరినట్లు అధికారులు వెల్లడించారు. వార్షిక సమగ్ర సమీక్ష నిర్వహించకపోవడం వల్ల యువ ఓటర్ల నమోదు నిలిచిపోయిందంటూ వస్తున్న కథనాల నడుమ ఈ గణాంకాలు వెలువడ్డాయి. అయితే, ఈ ప్రచారానని ఈసీ అధికారులు ఖండించారు. వార్షిక సమీక్షతో సంబంధం లేకుండా అర్హులైన పౌరులు నిరంతరం తమ పేర్లను నమోదు చేసుకునేందుకు 'సబ్‌స్క్రిప్షన్ పద్ధతి/ కంటిన్యూ అప్‌డేట్' అందుబాటులో ఉందని స్పష్టం చేశారు.ఈ 2.73 కోట్లలో తొలిసారి ఓటు హక్కు పొందిన వారితో పాటు, ఇప్పటికే అర్హత ఉండి ఇటీవల జాబితాలో చేరిన లేదా వివరాలను అప్‌డేట్ చేసుకున్న 18-28 ఏళ్ల మధ్య యువకులు కూడా ఉన్నారని తెలిపారు. "ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, సెక్షన్ 14లో 2021లో చేసిన సవరణ ప్రకారం ఓటర్ల జాబితాలో పేరు లేనివారు లేదా జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి పౌరుడూ ఎలాంటి సమీక్ష ప్రక్రియ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండానే నిరంతర అప్‌డేట్ విధానం ద్వారా పేరు నమోదు చేసుకోవచ్చు. స్పెషల్ సమరీ రివిజన్ , స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రెండూ సెక్షన్ 21(3) కింద చేపట్టే ఆప్షన్ ప్రక్రియలు మాత్రమే.

ఈ రెండింటినీ ఒకేసారి నిర్వహించాలనే చట్టబద్ధమైన నిబంధనేదీ లేదు" అని అధికారులు వివరించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 14(బీ)కి చేసిన సవరణ తర్వాత ఈ నాలుగు అర్హత తేదీలను అందుబాటులోకి తెచ్చారు. ఈ నాలుగు తేదీలలో ఏ రోజైనా 18 ఏళ్లు పూర్తి చేసుకునే పౌరులు ముందుగానే 'ఫారం 6' ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుడికి అర్హత వయస్సు వచ్చే త్రైమాసికంలో ఆ దరఖాస్తును పరిశీలిస్తారు.తుది ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత కూడా నిరంతర అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతుందని, కాబట్టి తదుపరి సమీక్ష వరకు ఆగాల్సిన పనిలేదని ఎన్నికల సంఘం తెలిపింది. కొత్త ఓటరు నమోదు కోసం 'ఫారం 6'ను కేటాయించారు.బీహార్‌లోని ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత నవంబర్ 2025లో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అలాగే ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలలో కూడా ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేసి అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించారు. ఎస్ఐఆర్, ఎస్ఎస్ఆర్, నిరంతర అప్‌డేట్ అనేవి వేర్వేరు ప్రక్రియలని ఈసీ స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ సమయంలోనూ 18-28 ఏళ్ల వయస్సు వారిలో 2.73 కోట్ల మంది కొత్తగా చేరడం యువ ఓటర్ల నమోదు ఆగిపోలేదనడానికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.

## షాట్‌పుట్‌లో రజతం సాధించిన తేజిందర్‌పాల్ సింగ్: గుల్వీర్-యూనస్ 1500m ఫైనల్‌కు!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడలలో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనలతో పతకాల పంట పండిస్తున్నారు. తాజాగా ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో భారత్ మరోసారి తన సత్తా చాటింది. షాట్‌పుట్ విభాగంలో తేజిందర్‌పాల్ సింగ్ తూర్ రజత పతకం సాధించగా, స్ప్రింటర్ అనిమేష్ కుజూర్ 200 మీటర్ల ఫైనల్‌కు దూసుకెళ్లారు. అలాగే మిడిల్ డిస్టెన్స్ రన్నర్లు కూడా పతకం రేసులోకి దూసుకెళ్లారు.

**షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్ సింగ్ రజతం:**

పురుషుల షాట్‌పుట్ ఫైనల్‌లో భారత స్టార్ అథ్లెట్ తేజిందర్‌పాల్ సింగ్ తూర్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. తన ఐదో ప్రయత్నంలో 20.64 మీటర్ల దూరం విసిరి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇరాన్‌కు చెందిన మొహమ్మద్‌రెజా తయేబిసే 20.81 మీటర్ల గేమ్స్ రికార్డు త్రోతో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నారు. గతంలో 2018 జకార్తా, 2022 హాంగ్జౌ ఏషియన్ గేమ్స్‌లో వరుసగా స్వర్ణాలు గెలిచిన తూర్.. తాజాగా ఐచి-నగోయా గేమ్స్‌లో రజతం సాధించి ఆసియా వేదికపై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నాడు.

**1500 మీటర్లలో గుల్వీర్, యూనూస్ దూకుడు:**

పురుషుల 200 మీటర్ల సెమీఫైనల్-3లో భారత స్ప్రింటర్ అనిమేష్ కుజూర్ 20.81 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని రెండో స్థానంలో నిలవడంతో, ఫైనల్‌కు అర్హత సాధించారు. థాయ్‌లాండ్‌కు చెందిన పురిపోల్ బూన్సన్ 20.10 సెకన్లతో గేమ్స్ రికార్డు సృష్టించారు. అంతకుముందు 100 మీటర్ల ఫైనల్ రేసును కోల్పోయిన అనిమేష్, 200 మీటర్లలో అద్భుతమైన కంబ్యాక్ ఇచ్చి పతక రేసులో నిలిచారు.

ఇక పురుషుల 1500 మీటర్ల ఈవెంట్‌లో భారత్‌కు మరో శుభవార్త అందగా.. హీట్-2లో గుల్వీర్ సింగ్ (3:45.79), హీట్-1లో యూనూస్ షా (3:45.77) తమ విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఎల్లుండి (సోమవారం, సెప్టెంబర్ 28) ఈ పతక పోరు జరగనుంది.

**కబడ్డీలోనూ గోల్డ్ మెడల్:**

ఇదిలా ఉండగా, ఈరోజు (సెప్టెంబర్ 26, శనివారం) జరిగిన పురుషుల కబడ్డీ ఫైనల్‌లో ఇరాన్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ అద్భుతమైన కంబ్యాక్‌తో 39--34 తేడాతో గెలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. తొలి అర్ధభాగంలో 17--18తో వెనుకబడినప్పటికీ, ఆ తర్వాత చెలరేగిపోయి భారత్ గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకుంది.

# తిరువనంతపురంలో రోహిత్ ఫ్యాన్స్ రచ్చ.. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం బయట 50 అడుగుల కటౌట్!







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వర్సెస్ వెస్టిండీస్ తొలి వన్డే మ్యాచ్‌కు వేదికైన కేరళలోని తిరువనంతపురంలో క్రికెట్ ఫీవర్ తారాస్థాయికి చేరుకుంది. గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం పరిసరాలు ప్రస్తుతం క్రికెట్ అభిమానుల కోలాహలంతో పండగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. రేపు (సెప్టెంబర్ 27, ఆదివారం) జరగనున్న ఈ హైవోల్టేజ్ పోరు కోసం కేరళ ఫ్యాన్స్ ఘన స్వాగతం పలుకుతున్నారు. ముఖ్యంగా టీమిండియా స్టార్ ఓపెనర్, రోహిత్ శర్మపై తమ అభిమానాన్ని చాటుకుంటూ ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**రోహిత్ శర్మ 50 అడుగుల కటౌట్:**

ఇండియా వర్సెస్ విండీస్ మ్యాచ్ నేపథ్యంలో ఆల్ కేరళ రోహిత్ శర్మ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియం బయట ఏకంగా 50 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అయితే కేరళ గడ్డపై రోహిత్ కు ఉన్న క్రేజ్ ఏపాటిదో ఈ కటౌట్ తో మరోసారి నిరూపించింది. తిరువనంతపురానికి తరలివస్తున్న క్రికెట్ లవర్స్, అభిమానులు ఈ భారీ కటౌట్ ఎదుట ఆగి

పండగ వాతావరణంలో గ్రీన్ ఫీల్డ్ స్టేడియం:

కేరళలో ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు జరిగినప్పుడల్లా అభిమానులు భారీ బ్యానర్లు, కటౌట్లతో తమ అభిమాత్వాన్ని చాటుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజాలు తిరిగి వన్డే జట్టులోకి అడుగు పెడుతుండటంతో ఈ మ్యాచ్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. స్టేడియం బయట కనిపిస్తున్న ఈ కోలాహలం, అభిమానుల కేరింతలు మ్యాచ్‌లోని ఉత్సాహాన్ని మరింత పెంచుతున్నాయి. ఇరు జట్ల మధ్య రసవత్తర పోరుకు రంగం సిద్ధంకావడంతో తిరువనంతపురం క్రికెట్ మాయాజాలంలో మునిగిపోయింది.

# ఆసియా క్రీడలు: కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్.. ఇరాన్‌ను ఓడించి పురుషుల జట్టు స్వర్ణం కైవసం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది.పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.




# నచ్చకపోయినా కొన్నిసార్లు రాజీ పడక తప్పదు!

గ్లామర్ ప్రపంచంలో వెలిగిపోయే తారల జీవితాలు బయట నుంచి రంగులమయంగా కనిపించినా? దాని వెనుక అనేక ఆర్థిక సవాళ్లు, వృత్తిపరమైన రాజీలు దాగి ఉంటాయనేది పచ్చి నిజం. మనకు నచ్చకపోయినా కొన్నిసార్లు పరిస్థితిని బట్టి రాజీ పడక తప్పదు అంటూ బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తెరపై ఎన్ని వైవిధ్యమైన పాత్రలు పోషించినా? సినీ పరిశ్రమలోని ఆర్థిక వాస్తవాలు, పరిమితుల వల్ల నటీనటులు ఏమాత్రం ఇష్టం లేని ప్రాజెక్టులను కూడా చేయాల్సి వస్తుందని నిర్మొహమాటంగా వెల్లడించారు.



తమకంటూ సొంత ప్రాధాన్యతలు, కళాత్మక అభిరుచులు ఉన్నప్పటికీ జీవనోపాధి కోసమే నచ్చని పాత్రలను అంగీకరించాల్సి వస్తుందని ఫాతిమా ఓపెన్‌గా చెప్పారు. -మేము సంపన్న కుటుంబాల నుంచి రాలేదు. ప్రతి ఒక్కరికీ డబ్బు అవసరం ఉంటుంది. కేవలం నటులమే తప్ప సినిమాలకు కోట్లు ఖర్చుపెట్టే నిర్మాతులం కాదు- అంటూ సినీ రంగానికి సంబంధించిన ఆర్థిక చేదు నిజాలను బయటపెట్టారు. చేతిలో ఉన్న తక్కువ





అవకాశాల్లోనే ఉత్తమమైనదాన్ని ఎంచుకుంటూ ముందడుగు వేయక తప్పదని, పరిశ్రమలో టైమింగ్ వరుస విజయాలే అవకాశాల సంఖ్యను నిర్ణయిస్తాయన్నారు.హిందీ చిత్ర పరిశ్రమలో మహిళా నటీమణులకు లభించే పాత్రల పరిమితుల గురించి కూడా ఫాతిమా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పురుష నటులకు నటనలోని పూర్తి స్థాయి నైపుణ్యాన్ని చూపించడానికి అనేక అవకాశాలు దక్కుతాయని, కానీ మహిళల విషయానికి వచ్చేసరికి లోతైన, విభిన్నమైన కోణాలున్న పాత్రలు చాలా అరుదుగా లభిస్తాయన్నారు. సినిమా అనేది సమాజానికి ప్రతిబింబమని పేర్కొంటూ సమాజంలో ఉన్నట్లే సినిమాల్లోనూ లింగ ఆధారిత పాత్రల పరిమితులు స్పష్టంగా ఉంటాయని విశ్లేషించారు.

సినిమాల్లో మహిళా పాత్రలను చిత్రీకరించే తీరుపై మాట్లాడిన ఫాతిమా నెగెటివ్ లేదా కాంప్లెక్స్ ఛాయలున్న పాత్రల విషయంలో పరిశ్రమ ఇంకా పాత మూస ధోరణుల్లోనే ఉండిపోయిందని అభిప్రాయపడ్డారు. పురుషులకు లభించినట్లుగా సంక్లిష్టమైన, గందరగోళంతో కూడిన సాధారణ మహిళా పాత్రలను హుందాగా చూపించే స్థాయికి బాలీవుడ్ ఇంకా చేరుకోలేదన్నారు. నలుపు-తెలుపుల మధ్య ఉండే సాధారణ మానవ స్వభావాన్ని మహిళా పాత్రల్లో ఆవిష్కరించే ప్రయత్నాలు మరింత ఎక్కువగా జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఫాతిమా షనా షేక్ తాజా ప్రాజెక్టు విషయానికి వస్తే జియోహాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న -హుంకార్-వెబ్ సిరీస్‌లో ఫాతిమా ఏసీపీ జస్లీన్ సింగ్ సోయిన్ అనే పవర్‌ఫుల్ పోలీసు ఆఫీసర్‌గా నటించారు. ఒక ఆధ్యాత్మిక గురువుపై పాఠశాల విద్యార్థిని చేసే లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో సిరీస్ కథాంశం సాగుతుంది. ఈ కేసును నిర్భయంగా దర్యాప్తు చేసే పోలీస్ అధికారిగా ఫాతిమా నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965